# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 21,ఫిబ్రవరి, 2015

తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడంతో పాటు  కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మొదటి విడతలో గుర్తించిన అమరవీరుల కుటుంబాలకు పదిలక్షల రూపాయల చొప్పున ఆర్థికసహాయం అందించాలని ఆదేశించారు. ఆయా జిల్లాల మంత్రులు, కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని కోరారు. శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, బీడీ కార్మికుల భృతి, ఫార్మసీ పరిశ్రమకు చేయూత తదితర అంశాలపై సమీక్షించారు. మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్యకార్యదర్శి నర్సింగ్ రావు, ఆర్థిక శాఖ కార్యదర్శులు నాగిరెడ్డి, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

1. <u>అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం</u>

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమర వీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించే విషయంపై మార్గదర్శకాలు రూపొందించాలని, ప్రతిపాదనలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కుటుంబంలో ఎవరికి ఉద్యోగ అవకాశం కల్పించాలనే విషయాన్ని కుటుంబ సభ్యులకే వదిలిపెట్టాలని, ఒకవేళ కుటుంబంలో ఉద్యోగానికి ఎవరూ అర్హులు లేకున్నా, ప్రభుత్వ ఉద్యోగంపై ఆసక్తి లేకున్నా మరో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ఉపాధి చూపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యాపారం చేసుకుంటే అందుకు ఆర్థిక సహకారం అందించాలని, వ్యవసాయ చేసుకుంటామంటే వారికి భూమిని సమకూర్చాలని చెప్పారు. ఇంకా సదరు కుటుంబ సభ్యులు తమ కుటుంబం నిలబడడానికి ఏమి కోరుకుంటారో దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు తమ జిల్లాలో ఉన్న అమరవీరుల కుటుంబాల

జాబితా ప్రకారం ఒక్కొక్క కుటుంబానికి సంబంధించి ఏమి కావాలనే విషయంపై స్వయంగా దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థిక సాయాన్ని ఏమాత్రం జాప్యం లేకుండా అందించాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన డబ్బులు కూడా వెంటనే కలెక్టర్ల వద్ద పెట్టాలని ఆర్థిక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

2. బీడీ కార్మికులకు భృతి

తెలంగాణలో బీడీ కార్మికులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున అందించే భృతి కార్యక్రమాన్ని మార్చి 1న ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఆ రోజు స్వయంగా తానే కరీంనగర్ జిల్లా మెట్ పల్లి, మెదక్ జిల్లా దుబ్బాక, నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని చెప్పారు. మిగతా జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రతీ మండలంలో బీడీ కార్మికులకు భృతి ఇచ్చే కార్యక్రమాన్ని ఆయా మండలాల ఎంపిడివోలు పర్యవేక్షించాలన్నారు. బీడీ కార్మికులున్న జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి ఫోన్లో మాట్లాడారు. బీడీ కార్మికుల భృతి కోసం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ రూ.40 కోట్ల రూపాయలు విడుదల చేసింది.

3. వ్యాక్సిన్ పరిశ్రమకు ప్రోత్సాహం

తెలంగాణ రాష్ట్రంలో వ్యాక్సిన్ ఉత్పత్తులకు ప్రభుత్వం కావాల్సిన ప్రోత్సాహం అందిస్తుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. శాంతా బయోటెక్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి మెమోరాండం సమర్పించారు. దేశంలో ఏడాదికి రూ.4500 కోట్ల విలువైన వ్యాక్సిన్లు తయారవుతుంటే అందులో తెలంగాణలోనే రూ.3 వేలకు పైగా వ్యాక్సిన్లు తయారవుతున్నాయని వరప్రసాద్ రెడ్డి అన్నారు. దేశంలో వ్యాక్సిన్ల తయారీలో ఆరు ప్రముఖ కంపెనీలు భాగస్వాములైతే అందులో తెలంగాణవే నాలుగున్నాయన్నారు. హైదరాబాద్ నగరం వ్యాక్సిన్ల తయారీకి కేరాఫ్ అడ్రస్ గా మారిందని వివరించారు. ఈ పరిశ్రమను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. అయితే

ఈ వ్యాక్సిన్ల ప్రమాణాలను పరీక్షించడానికి కావాల్సిన ల్యాబులు మాత్రం తెలంగాణలో అందుబాటులో లేవని చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ లోని కసౌలిలోని సెంట్రల్ డ్రగ్ ల్యాబరేటరీకి పంపాల్సి వస్తున్నదని చెప్పారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ల్యాబ్ పెడతామని, ఇందుకు అవసరమైన భూమి, ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్లో ల్యాబ్ పెట్టడం వల్ల తెలంగాణకే కాక, దక్షిణ భారత దేశానికి చెందిన రాష్ట్రాలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు.

4. ముఖ్యమంత్రిని కలిసిన జయప్రద

ప్రముఖ సినీ నటి జయప్రద శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుని కలిశారు. ఈ నెల 27న జరిగే తన చెల్లెలి కూతురు వివాహ నిశ్చితార్థానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం